సాక్షి
బాపట్ల
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అమరేశ్వరుని సన్నిధిలో..

అమరావతి: అమరేశ్వర స్వామిని ఆక్టోపస్ డీఐజీ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు శేషావస్త్రాలు తీర్థప్రసాదాలతో ఆశీర్వచనం అందజేశారు.



నాగార్జున కొండ సందర్శన

విజయపురిసౌత్: నాగార్జునకొండను భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్(జాతీయ సాంస్కృతిక నిధి) డాక్టర్ వసంతకుమార్ స్వర్ణకార్ శుక్రవారం సందర్శించారు.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

ముగ్గురు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

బాపట్ల అర్బన్: పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ బి.నాగాంజనేయులు, ఓపెన్ స్కూల్ పరీక్షల ప్రభుత్వ డెఫ్ అండ్‌డెమ్ రెసిడెన్షియల్ స్కూల్ వెదుళ్లపల్లిలోని పరీక్ష కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లు బి.వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్‌లను సస్పెండ్ వేటు వేసినట్లు చెప్పారు. వీరితో చందోలు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.సుబ్బారావు, డీఓ కె.శ్రీనివాసరావు, వెదుళ్లపల్లి సీఎస్ కె.అనిల్‌కుమార్, డీఓ విజయరాజులకు చార్జి మెమోలు జారీ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

నిమ్మకాయల ధరలు




తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,300, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం 528 అడుగులు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 528.40 అడుగుల వద్ద ఉంది. ఇది 165.0408 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,287, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,920, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఔట్‌ఫ్లోగా 9,875 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 7,641 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. నీటిమట్టం 805.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.9380 టీఎంసీలకు సమానం.

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కులు



తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1316 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 286, పశ్చిమ కెనాల్‌కు 45 క్యూసెక్కులు, , కొమ్మమూరు కాల్వకు 800 క్యూసెక్కులు విడుదల చేశారు.

92.53 శాతం పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక శుక్రవారం జిల్లాలో లబ్ధిదారులకు వలంటీర్లు ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. గుంటూరు జిల్లాలో శుక్రవారం 92.53 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,52,367 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.34 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 2,33,521 మంది లబ్ధిదారులకు రూ.64.38 కోట్ల పంపిణీ పూర్తి చేశారు.

జయ ఏసు..శుభ క్రీస్తు



గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. 40 రోజులు పాటు నిర్వహించిన దీక్ష విరమించారు. ఏసు శుద్ధ రక్తంతో కడుగుకొని, కృతజ్ఞతతో పరివర్తన పొంది.. నూతన శక్తి పొందే దినం అని విచారణ గురువులు సందేశమిచ్చారు.. శ్రమలలో కూడా త్యాగంలో ఏ భేదం లేక తోటి మానవుని పడద్రోయక బాధపెట్టక, పైకెత్తి ఆదరించి ప్రోత్సాహపరిచే స్ఫూర్తినిచ్చే దృశ్యంగా పేర్కొన్నారు. పేరలిలో శిలువ యాత్ర నిర్వహించారు. బాపట్లలో ప్రార్థనలు నిర్వహించారు. -సాక్షి నెట్‌వర్క్



అసైన్డ్ డొంక కదిలింది

రీ సర్వేతో అక్రమాలు వెలుగులోకి..

- పలువురు టీడీపీ నేతల స్వాధీనంలో భూములు
- ఆ భూముల్లో రొయ్యల చెరువులు, రియల్ వెంచర్లు
- చర్యలకు ఉపక్రమించిన జిల్లా కలెక్టర్, జేసీ
- ఇప్పటికే 600 మంది ఆక్రమణ దారులకు నోటీసులు
- బాపట్ల ప్రాంతంలో 30 వేల ఎకరాలు అసైన్డ్ భూములు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో వేలాది ఎకరాల అసైన్డ్‌భూముల స్వాధీనానికి ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా అసైన్డ్ భూములు అధికంగా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన బాపట్ల పరిసరాల్లోనే 30 వేల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నట్లు అంచనా. ఈ భూములన్నీ దాదాపుగా ఆక్రమణ దారుల చెరలో ఉన్నట్లు గుర్తించిన జిల్లా కలెక్టర్, జేసీలు ఆ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకునేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

ఆక్రమణ దారులకు నోటీసులు..

ఇప్పటికే అసైన్డ్ భూముల ఆక్రమణ దారులుగా ఉన్న 600 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపట్టి ఆ భూములను త్వరలో స్వాధీనం చేసుకోనున్నారు. జిల్లాలో రీసర్వే పూర్తి అయితే వేలాది ఎకరాల అసైన్డ్ భూముల బండారం బయటపడనుంది.

30 వేల ఎకరాలు..

బాపట్ల పట్టణ పరిసరాల్లోనే 30 వేల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గత టీడీపీ ప్రభుత్వ ఆయాంలోనే ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగినట్లు తెలుస్తోంది. పలువురు టీడీపీ నేతలు అసైన్డ్‌భూములను కబ్జా చేసినట్లు సమాచారం. బాపట్లకు చెందిన ప్రతిపక్షనేత అసైన్డ్ భూముల కబ్జా వ్యవహారంలో ప్రధానపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు టీడీపీ ముఖ్యనేతలు అసైన్డ్ భూములను ఆక్రమించి రొయ్యల చెరువులు సాగుచేసినట్లు సమాచారం. మరికొందరు అసైన్డ్ భూముల్లోనే రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ఆ భూములను అమ్మకానికి పెట్టి రూ.కోట్లు గడించినట్లు చెబుతున్నారు.

రీసర్వేతో ఆక్రమణలు వెలుగులోకి..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే పూర్తి అయితే అసైన్డ్ భూముల కబ్జాల పర్వం వెలుగుచూడనుంది. అందు కోసం జిల్లా కలెక్టర్, జేసీ రీసర్వేను మరింత వేగవంతం చేశారు. మరో వైపు రీసర్వే పూర్తి కాకుండానే ఇప్పటికే స్థానిక రెవెన్యూ అధికారులు గుర్తించిన అసైన్డ్ భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఆక్రమణ దారులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని కలెక్టర్, జేసీలు క్రిందిస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

అభివృద్ధి పనులకు భూములు..

బాపట్ల జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏడాది అవుతుంది. ఇప్పటికే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో సొంత భవనాలను సమకూర్చుకోలేదు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల సొంత భవనాలకు స్థలం అవసరం ఉంది. దీంతో పాటు పరిశ్రమలు, వివిధ శాఖల పరిధిలో అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున భూసేకరణ చేయాల్సి ఉంది. తగినంతగా భూములు బాపట్ల పరిసరాలతో పాటు జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నా అవి ఆక్రమణలో ఉండటంతో వాటిని వినియోగించలేని పరిస్థితి. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జేసీలు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో అసైన్డ్ భూముల స్వాధీనానికి అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే బాపట్ల శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 50 ఎకరాల అసైన్డ్ భూములను మెడికల్ కళాశాల కోసం స్వాధీనం చేసుకుంది. ఈ ప్రాంతంలో ఇంకా 300 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక్కడే కాకుండా బాపట్ల శివారు ప్రాంతాల్లోని వేలాది ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నట్లు లెక్కలు తీశారు. రీసర్వే పూర్తి అయితే జిల్లాలో పెద్దఎత్తున జరిగిన అసైన్డ్ భూముల ఆక్రమణ వ్యవహారం వెలుగుచూడనుంది. ఆ భూములు స్వాధీనం చేసుకుంటే జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.



ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూముల్లో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

అసైన్డ్ భూముల స్వాధీనానికి సత్వర చర్యలు



జిల్లాలో అసైన్డ్ భూములు అధికంగా ఉన్నాయి. వీటిల్లో అధిక శాతం భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఇప్పటికే కొంత ఆక్రమణలను గుర్తించాం. చీరాల ప్రాంతంలోనే 600 మందికి అసైన్డ్ భూములకు సంబంధించి నోటీసులు ఇచ్చాం. మిగిలిన ఆక్రమణలకు సంబంధించి నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. రీసర్వే పూర్తి అయితే పెద్ద ఎత్తున అసైన్డ్ భూముల వివరాలు బయటకు వస్తాయి. వీటిని స్వాధీనం చేసుకొని వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

– కె.శ్రీనివాసులు, జిల్లా జాయింట్ కలెక్టర్

దళిత, బీసీ, మహిళా ద్రోహి చంద్రబాబు

- ప్రజలు మిమ్మల్ని ఎప్పుడో మరచిపోయారు
- 2024లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి
- రాబోయేదీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ సునీత, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: దళిత, బీసీ, మహిళా ద్రోహి చంద్రబాబు నాయుడు.. అన్ని కులాలకు ద్రోహం చేసింది చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. 'జగన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా అద్దంకి వచ్చిన ఆమె స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని దళితులనే అవమానించిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. దళితులన్నా, బీసీలన్నా, మహిళలన్నా గౌరవం లేని బాబు, బీసీ మత్స్యకారులు వారి సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే తాట తీస్తా అని, కించపరచి అవమానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. గతంలో మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి వారితో ఓట్లు వేయించుకుని గద్దె నెక్కిన తరువాత వారిని మోసం చేయలేదా అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే పదం ప్రజల నుంచి వచ్చిందంటే వైఎస్సార్ సీపీ పరిపాలన ఎంత బాగుందో తెలుస్తోందని వివరించారు. జాక్‌పాట్ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కాదని. 151సీట్లు గెలిచి పరిపాలన సాగిస్తున్న గొప్ప వ్యక్తి అని అన్నారు. 2024లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురాలి. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం ద్వారా జరిగిన మంచిని తెలియజేస్తూ ముందుకెళ్లాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండోసారి జగనన్నను సీఎంగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, పట్టణ పార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి పూనూరి చైతన్య కిషోర్ పాల్గొన్నారు.

నయనానందకరం.. ఆది దంపతుల నదీ విహారం



పంచ హారతులిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గంగా పార్వతి(దుర్గా) సమేత మల్లేశ్వర స్వామి వార్ల నదీ విహారం శుక్రవారం నయనానందకరంగా సాగింది. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది ఆది దంపతులకు నదీ విహారం ఏర్పాటు చేశారు. తొలుత మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద స్వామి వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఆది దంపతులకు పూజలు నిర్వహించి నదీ విహారానికి పయనమయ్యారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు దుర్గాఘాట్‌కు చేరుకుంది. పూలతో అలంకరించిన బోటుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆది దంపతులను ఉంచి పూజలు చేశారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులతో పాటు చైర్మన్, ఈఓ తదితర ముఖ్య అధికారులు బోటుపైకి చేరుకున్నారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావఝల శ్రీనివాస శాస్త్రి, యజ్ఞనారాయణ శర్మ, ఇతర అర్చకులు పూజలు నిర్వహించారు. మూడు సార్లు నదిలో ప్రదక్షిణగా తిరిగి దుర్గాఘాట్‌కు చేరుకుంది. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, నిడమానూరి కళ్యాణి, అల్లూరి కృష్ణవేణి, తొత్తడి వేదకుమారి, దుర్గగుడి అధికారులు, వెస్ట్ ఏసీపీ హనుమంతరావు, వన్‌టౌన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పూజలకు హాజరైన కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి

కృష్ణా టీడీపీలో తిరుగుబావుటా!

- బాబు ఎత్తులకు సీనియర్లు ఝలక్
- దిగుమతి నేతలపై ధిక్కారస్వరం
- అచ్చెన్నకు అంత సీన్ లేదంటున్న ముఖ్యులు
- అధినేత పర్యటనలోగా తాడోపేడో తేల్చుకునేలా...
- భిన్నంగా జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల మార్గదర్శకాలు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలు తిరుగుబావుటా ఎగురవేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాబు ఎత్తులకు సీనియర్లు చెక్ పెడుతూ పైఎత్తులు వేశారని పరిశీలకులు అంటున్నారు. కృష్ణా నాయకులిచ్చిన ఝలక్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఇదివరకు ఇచ్చిన డైరెక్షన్‌కు పూర్తి భిన్నంగా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఫ్లాష్ మెసేజ్ ఇవ్వాల్సి వచ్చింది. తాజా పరిణామాలు పార్టీలోని ముఖ్య నాయకులు, శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రవాసాంధ్రులు, స్థితిమంతులకు ప్రాధాన్యమిచ్చే ప్రక్రియను తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేష్‌లు కొనసాగిస్తున్నారు. ఎన్నికలకు రూ.పదులు, వందల కోట్లను ఖర్చు చేయగలిగే వారికే టిక్కెట్లనే సంకేతాలను రాజకీయ మార్కెట్‌లోకి ఇదివరకే వదిలారు. దీంతో ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, విభిన్న వర్గాల సంపన్నులు ముఖ్యంగా టీడీపీకి మద్దతిచ్చే సామాజికవర్గీయులు ముందువరుసలో ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలోనూ వారే కనిపిస్తున్నారు. తాజాగా గుడివాడ నుంచి పోటీకి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు విదేశాల్లో వ్యాపారాలు చేస్తున్న వెనిగండ్ల రాము. గుంటూరు నుంచి ఉయ్యూరి శ్రీనివాస్‌ను ప్రోత్సహించే క్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొక్కిసలాట చోటు చేసుకుని ముగ్గురు పేద మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే.

కృష్ణాలో తాజా పరిణామమిది...

ఉమ్మడి కృష్ణాలో పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టవుతుండటంతో చంద్రబాబు జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నందిగామ, జగ్గయ్యపేటలో ముగియగా ఈ నెల 12– 14 తేదీల్లో మచిలీపట్నం నుంచి గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల మీదుగా నూజివీడు వరకు కార్యక్రమాన్ని ఖరారు చేశారు. మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చంద్రబాబు, లోకేష్‌లను నిత్యం తూర్పారపడుతూ కొరకరాని కొయ్యగా మారిన నేపథ్యంలో గుడివాడలో ఎలాగైనా గట్టిపోటీ ఇవ్వాలనే ఆశతో బాబు ఉన్నారు. ఆ దృష్ట్యానే ఎన్టీఆర్ స్వస్థలమైన నిమ్మకూరులో, గుడివాడలో బాబు బసచేసేలా కార్యక్రమం రూపొందింది.

సీనియర్లు కూడబలుక్కుని...

సీనియర్లయిన కొనకళ్ల, దేవినేని, కొల్లు తదితరులు కూడబలుక్కునే రాముకు సమాచారం ఇవ్వలేదనేది సమాచారం. 'రావి వెంకటేశ్వరరావు ఇంఛార్జిగా ఉన్నారు. సొమ్ములతో ఊడిపడినంత మాత్రాన రాముకు మేం ప్రాధాన్యం ఇవ్వాలా? ఈరోజు రావి, రేపు మాలో ఎవరికైనా ఇలాంటి పరిస్థితే ఎదురుకాదన్న గ్యారంటీ ఏంటి? అధిష్టానానికి కూడా మా భావనలు తెలియాలిగా' అని జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు ఒకరు అన్నారు. పార్టీకోసం ఏళ్ల నుంచి కష్టపడిన వారిని పక్కకు తోసేస్తూ డబ్బులున్న వారికే సీటు ఇస్తామంటే చూస్తూ మౌనంగా ఉండాలా? అని మరో నేత ఘాటుగా స్పందించారు. ఇదే అంశాన్ని కొనకళ్ల వద్ద సాక్షి ప్రస్తావించగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సర్క్యులర్ ప్రకారమే తాము నడుచుకున్నామన్నారు. కార్యక్రమం కోసం విభిన్న పనులు ఉంటాయన్నారు.

అచ్చెన్న ఇలా... బాబు అలా...

నాయకులు కొందరు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీకి అప్రతిష్ఠ తెస్తున్నారు. క్రమశిక్షణ లోపిస్తోంది. అలాంటి వారిపై తీవ్ర చర్యలు తప్పవు. తమకు సంబంధంలేని నియోజకవర్గాల్లో ఇతర నాయకులు పర్యటిస్తూ వర్గాలను ప్రోత్సహిస్తూ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారు. ఇకపై అలాంటివేవీ చేయడానికి వీల్లేదని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి హోదాలో అచ్చెన్నాయుడు కొన్నాళ్ల కిందట ఓ ప్రకటనలో హెచ్చరించారు. గుడివాడ విషయంలో కృష్ణా నాయకులు అచ్చెన్న ప్రకటననే సాకుగా చూపి రావికి ప్రాధాన్యమిచ్చి, రామును దూరం పెట్టి అధిష్టానానికి ఝులక్ ఇచ్చారు.

బాబు ఫ్లాష్ మెసేజ్...

కృష్ణా నేతల తిరుగుబాటుకు ఉలిక్కిపడిన చంద్రబాబు పార్టీ నేతలకు ఫ్లాష్ మెసేజ్ పంపారు. 'పార్టీ బలోపేతం కృషిచేసే పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఇంఛార్జుల అనుమతి అవసరం లేదు' అని స్పష్టం చేశారు. ఇది అచ్చెన్న హెచ్చరికకు పూర్తి విరుద్ధంగా ఉండటం పరిశీలనాంశం.

అచ్చెన్న జోక్యం చేసుకుని...

గుడివాడలో కార్యక్రమానికి సంబంధించి తనకు ఆహ్వానం లేదని అలకబూనిన రాము వ్యవహారం అచ్చెన్నాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన్ను వెంటపెట్టుకుని చంద్రబాబు వద్దకు వెళ్లాల్సి వచ్చింది. దీనిపై బాబు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఇకపై ఇలాంటివి జరగకూడదని, రాముకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆయన ద్వారా వనరులను సమకూర్చుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

ఇన్‌చార్జికే జిల్లా నేతల ప్రాధాన్యం

గుడివాడలో వెనిగండ్ల రామును పోటీకి దింపాలనే యోచనలో అధిష్టానం ఉండగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా రావి వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. బాబు కార్యక్రమం ఏర్పాట్లలో భాగంగా కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు బుధవారం గుడివాడలో పర్యటించారు. జిల్లా పరిధిలోని నియోజకవర్గ ఇంఛార్జులతో కొనకళ్ల గురువారం ఉదయం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు పాల్గొన్నారు. రాముకు రెండు రోజులూ అధికారికంగా సమాచారం ఇవ్వలేదు. సమావేశానికి పిలవలేదు. బాబు, లోకేష్‌ల ఆదేశాలమేరకు రాము కొన్ని నెలలుగా గుడివాడ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

హామీలను తుంగలోకి తొక్కింది చంద్రబాబు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లెరూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కింది చంద్రబాబేనని లోకేష్, బాలకృష్ణలు గ్రహించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. రేపల్లె పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. తేదేపా హయాంలోనే రాష్ట్రంలో అరాచక పాలన సాగిందన్నారు. రాష్ట్రంలో క్రమశిక్షణ కలిగిన యువకులను పెడత్రోవ పట్టించి జూదాలకు బానిసలను చేసింది తేదేపా నాయకులు, కార్యకర్తలేనని అన్నారు. రాష్ట్రంలో తేదేపాను ప్రజలు విశ్వసించటం లేదని గ్రహించిన చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. నాలుగు సంవత్సరాల పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును గత 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను వివరించేందుకు 20 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు అనే పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా పాల్గొంటున్నారన్నారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

సదరం క్యాంపు బుకింగ్‌కు 10న స్లాట్ విడుదల

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని సదరం క్యాంపునకు ఏప్రిల్, మే, జూన్ నెలల స్లాట్స్ కోసం బుకింగ్ చేసుకోదలిచిన వారు ఈనెల పదో తేదీన ఏపీ వైద్య విధానపరిషత్ స్లాట్స్ విడుదల చేస్తారని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పతి ఒక్కరూ గ్రామ, వార్డు సచివాలయం, మీసేవ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. సదరం స్లాట్స్ వెయిటింగ్ లిస్ట్ వచ్చిన వారు ఆసుపత్రి చుట్టూ తిరగనవసరంలేదన్నారు. వారి ఆధార్ లింకు ఉన్న మొబైల్‌కి మెసేజ్ వస్తుందన్నారు.

జోరుగా.. హుషారుగా..

- జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం
- అట్టహాసంగా ఆరంభించిన ప్రజాప్రతినిధులు
- తొలిరోజు రసవత్తరంగా పోటీలు
- తరలివచ్చిన వేలాది మంది రైతులు


జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

మాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జాతీయస్థాయి ఒంగోలుజాతి ఎడ్ల పందేలు నిర్వహించటం అభినందనీయమని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలోని గుంటూరు రోడ్డులో ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంబరాలలో భాగంగా చేపట్టిన ఎడ్ల బండ్ల లాగుడు, బలప్రదర్శన పోటీలను శుక్రవారం ఎంపీ, ఎమ్మెల్సీ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిరంతరం మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న వ్యక్తి ప్రభుత్వ విప్ పీఆర్కే అని కొనియాడారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఆయన ఏటా చెన్నకేశవ స్వామి తిరునాళ్ల, ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ వరికపూడిసెలకు అనుమతులు లభిస్తాయని, ప్రతి రైతుకు న్యాయం చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఎడ్ల పందేలకు రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు తరలిరావడం ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు మేరాజోత్ హనుమంతునాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు ఉప్పలపాటి జాని, కామనబోయిన కోటయ్య, బూదాల మరియమ్మ, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు నాలుగు పళ్ల జతల పోటీలు

మొదటి రోజు నాలుగు పళ్ల జతల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 14 జతలు పోటీలకు రాగా, రాత్రి వరకు పందేలు జరిగాయి. పోటీలను శ్రీనివాసశర్మ, పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండురంగారావు, బ్రహ్మారావు, చిల్లంచర్ల సత్యనారాయణ, జూలకంటి వీరారెడ్డి, నల్ల వెంకటరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి, గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, బొమ్మిన అల్లయ్య, యరబోతుల శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు, మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం

పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన పీఆర్కే దంపతులు


శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణంలో కూర్చున్న పీఆర్కే, రమాదేవి దంపతులు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవాలయ కల్యాణ మండపంలో గురువారం రాత్రి 11గంటలకు కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఐ సాంబయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రమాదేవి దంపతులు కల్యాణ మహోత్సవాలకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చి పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో 50 మంది పుణ్య దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు చలమాచలం శేషాచార్యులు, శ్రవణ్‌కుమార్, అడిగొప్పుల చెన్నకేశవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం ఘనంగా జరిపారు. అర్ధరాత్రి వరకు కల్యాణం జరగగా వేలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందించారు.

జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యం


వలంటీర్లకు బాండ్లు అందజేసి సన్మానం చేస్తున్న అంబటి మురళీకృష్ణ


చిన్నారులతో బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

బాపట్లటౌన్: నిన్నటి కంటే నేడు మెరుగ్గా ఉండటమే నిజమైన అభివృద్ధి అవుతుందని, పేద ప్రజల జీవన ప్రమాణ స్థాయి మెరుగుపరచడానికి భజరంగ్ ఫౌండేషన్ తనవంతు సహాయాన్ని తప్పక అందిస్తుందని ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సేవా కార్యక్రమాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్టువర్టుపురం గ్రామ పరిధిలోని కిశోర బాలికలు, మహిళలకు శానిటరీ నాప్‌కిన్‌లను భజరంగ్ తరఫున పంపిణీ చేశారు. గ్రామంలోని విద్యార్థినీ, విద్యార్థులకు, వివేక్ విద్యాశ్రమ్ హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేసి అభినందనలు తెలిపారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలనను స్ఫూర్తిగా తీసుకుని, భజరంగ్ జగన్నామ సంవత్సరం కార్యక్రమాలు రూపుదిద్దుకున్నాయని తెలిపారు. మహిళలు తమ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తతో మెలగాలన్న సందేశంతో శానిటరీ నాప్ కిన్‌లు అందిస్తున్నట్లు వెల్లడించారు.

జగనన్న సంక్షేమ పాలనలో కీలక భూమిక వహిస్తున్న వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేసేందుకు వలంటీర్లకు తగిన గౌరవాన్ని, సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. 15మంది వలంటీర్లకు రూ.5 లక్షల బీమా బాండ్లను అందించామన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల వలంటీర్లలో మరింత అవగాహన పెంపొందించే దిశగా పోటీ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. బాపట్ల మండలం ఎంపీపీ కళ్లం హరినాథ్‌రెడ్డి, స్టువర్టుపురం సర్పంచ్ బోగిరి ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాడేపల్లిలో పర్యటించిన జేసీ


ఫారెస్ట్ భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ జి. రాజకుమారి విస్తృతంగా పర్యటించారు. నవరత్నాల్లో భాగంగా ప్రతి ఒక్క లబ్ధిదారుడికి నివాస స్థలాలు కేటాయించేందుకు సీఆర్‌డీఏ పరిధిలో స్థలాలు కేటాయించింది. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పలుచోట్ల నిషేధిత భూముల్లో పేద ప్రజలు నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నివసించే వారు ప్రమాదం అంచుల్లో ఉండడం, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్న వారికి పక్కా నివాస గృహాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దానిలో భాగంగా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తాడేపల్లిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలకు నివాస స్థలాలను కేటాయిస్తున్నామని, కొన్నిచోట్ల అటవీ ప్రాంతంలోను, కాలువ అంచుల్లోను పేద ప్రజలు నివాసముంటున్నారని, ఆ స్థలాలను పరిశీలించి వారికి సైతం ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టుకునేందుకు లోన్లు అందజేస్తుందని, ఎక్కడెక్కడ అబ్జెక్షన్‌బుల్ స్థలాల్లో ఇళ్లు ఉన్నాయో పరిశీలిస్తున్నామన్నారు. ఇక నుంచి తాడేపల్లి ప్రాంతంలో అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఇళ్ల స్థలం కేటాయించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, డి.ఇ. కృష్ణారెడ్డి, ఆర్‌ఐలు వంశీకృష్ణ, ప్రశాంతి, ఫారెస్ట్ అధికారులు నరేంద్ర, రవి, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్లతో పర్యావరణ సమతుల్యత


తాబేళ్ల గుడ్లు సేకరిస్తున్న ట్రీ ఫౌండేషన్ ఫౌండర్ సుప్రజా ధరణి

చినగంజాం: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు సముద్ర తాబేళ్ల పెంపకం ఆవశ్యకత ఉందని ట్రీ ఫౌండేషన్ ఇండియా ఫౌండర్ డాక్టర్ సుప్రజా ధరణి అన్నారు. ట్రీ ఫౌండేషన్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ శాఖ ఆధ్వర్యంలో చినగంజాం మండలం ఏటిమొగ, కుంకుడు చెట్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. తాబేళ్ల రక్షణ దళ సభ్యులనుద్దేశించి మాట్లాడుతూ చిన్న తాబేళ్ల పిల్లలు పుట్టిన వెంటనే సముద్రంలోకి వదిలేయాలని, పిల్లలు వచ్చే సమయంలో కేంద్రం వద్ద రాత్రిళ్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పిల్లలను సంరక్షించే వివిధ రకాల ప్రోటోకాల్స్ గురించి ఆమె వివరించారు. అనంతరం బోటులో కుంకుడు చెట్లపాలెం నుంచి ఏటిమొగ గ్రామం వరకు గల రొంపేరులో దాదాపు 200 ఎకరాల్లో ఉన్న మడ మొక్కలు సందర్శించారు. మడమొక్కల సంరక్షణపై బాపట్ల జిల్లా డీఎఫ్‌ఓకు తెలియజేస్తామని తెలిపారు. జిల్లాలో ట్రీ ఫౌండేషన్, ఏపీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉన్న సముద్ర తాబేళ్ల కేంద్రంలో 105 తాబేళ్ల నుంచి 11724 గుడ్లను సేకరించి 2641 చిన్న తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి వదిలి పెట్టారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, సముద్ర తాబేళ్ల సంరక్షణ దళ సభ్యులు అయిల శ్రీను, అలహరి ఆంజనేయులు, కారాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, కార్యకర్త మరుప్రోలు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ .శ్రావణ బాబు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.శ్రావణబాబు

గుంటూరు మెడికల్: దేశాభివృద్ధికి శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ బాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ప్రజా ఆరోగ్య చైతన్య ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. డాక్టర్ శ్రావణ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పిల్లలు పాఠశాలలో రోజుకు ఒక గంటపాటు తప్పనిసరిగా ఆటలాడే విధంగా చూడాలన్నారు. నేటి చదువులు పిల్లలలోఎంతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని, ఆ ఒత్తిడిని తగ్గించడంలో ఆటలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వ్యాధుల బారిన పడకుండా క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలన్నారు. ఆహార నియమాలు పాటించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఐఎంఏ రాష్ట్ర ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్, గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్ , సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.అమరలింగేశ్వర రావు, ఐఎంఏ సభ్యులు డాక్టర్ వి.వి.రాం కుమార్, డాక్టర్ జి సతీష్ కుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కె.శివకుమార్, డి శ్రీనివాసరావు, లాల్ వజీర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు మిషన్ వాత్సల్య చేయూత

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి



చినగంజాం: తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన నిరాశ్రయులు, నిస్సహాయ అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లలోపు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న అనాథ బాలలను ప్రభుత్వం గుర్తించి నిబంధనలు ప్రకారం అర్హులైన బాలలకు మిషన్ వాత్సల్య ప్రాయోజిత పథకం ద్వారా ప్రతి నెలకు రూ.4 వేలు ఆర్థిక భరోసా కల్పిస్తారని చెప్పారు. రాష్ట్రంలో బాలల రక్షణ దృష్టిలో పెట్టుకొని ఈ పథకం గురించి సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ రాష్ట్రమంతా అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయం, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ సిబ్బందికి, వలంటీర్‌లు, బాలల కోసం పనిచేస్తున్న ఇతర సిబ్బంది ఇందులో భాగస్వామ్యం కావాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన బాలల ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులు సంబంధిత అధికారులకు అందజేస్తే వాటిని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పరిశీలించి అర్హత కలిగిన బాలల వివరాలు రాష్ట్ర స్థాయి అధికారులకు మంజూరు కోసం సమర్పిస్తామని తెలిపారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ప్రత్యేక కృషి

జిల్లా దేవాలయాల నిర్మాణ నిర్వహణ కన్వీనర్ బండారు జ్వాలా నరసింహం


ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె: హిందూ ధర్మ పరిరక్షణకై తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సమరసతా సేవా ఫౌండేషన్ కో-కన్వీనర్, జిల్లా దేవాలయాల నిర్మాణ నిర్వహణ కన్వీనర్ బండారు జ్వాలా నరసింహం అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో నిర్మాణంలో ఉన్న రామాలయ పనులను సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు నివాసం ఉండే ప్రాంతాలలో 11 దేవాలయాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. రూ.10లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. తొలివిడతగా ఆరు దేవాలయాలను, రెండో విడతగా ఐదు దేవాలయాలను నిర్మిస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మిస్తున్నట్లు చెప్పారు. తొలివిడత దేవాలయాలన్నీ పనులు పూర్తిచేసుకుని మే నెలలో ప్రతిష్ఠా కార్యక్రమాలు పూర్తవుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సహ కన్వీనర్ శొంఠి బాబూరావు, నంబూరు వేణు, వెంకటేశ్వరరావు, రమాదేవి దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా వీఆర్‌ఏల కార్యవర్గం ఏర్పాటు


ఎన్నికైన వారికి పూలదండలు వేసి అభినందిస్తున్న సభ్యులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా వీఆర్‌ఏల నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి తలారి సీతారాముడు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేటలోని రెవెన్యూ అసోసియేషన్‌లో గురువారం జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షులుగా నన్నే పాముల శ్రీను, కార్యదర్శిగా ఎస్. యేసయ్య, ఉపాధ్యక్షుడిగా బాష, సంయుక్త కార్యదర్శిగా ఆనందరావు, కోశాధికారిగా రోశయ్యలను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్న తర్వాత వివిధ మండలాల నుంచి కొన్ని సమస్యలు రాష్ట్ర అధ్యక్షులు దృష్టికి తీసుకువచ్చారన్నారు.